క్లుప్తంగా

వివాహిత దుర్మరణం

మడకశిర రూరల్: రోడ్డు ప్రమాదంలో వివాహిత చనిపోగా, మరో ఇద్దరు గాయాలపాలైన సంఘటన మడకశిర మండలం మల్లినాయకనపల్లి – గౌడనహళ్లి మధ్య సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు... మడకశిర మండలం చందకచెర్లకు చెందిన అంజినమ్మ (48), మల్లికార్జున దంపతులు సోమవారం రాత్రి మడకశిర వైపుగా ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మల్లినాయకనపల్లి – గౌడనహళ్లి గ్రామాల మధ్యకు చేరుకోగానే ఎదురుగా వచ్చిన ద్విచక్ర వాహనదారుడు ఢీకొన్నాడు. ఘటనలో కిందపడిన అంజినమ్మ అక్కడికక్కడే మృతిచెందింది. ఆమె భర్త మల్లికార్జునప్పతో పాటు ప్రమాదానికి కారణమైన ద్విచక్ర వాహనదారుడూ గాయపడ్డాడు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం


పాఠశాలకు కుర్చీలు, అరలు అందిస్తున్న పూర్వ విద్యార్థులు

పెనుకొండ రూరల్: మండల పరిధిలోని గుట్టూరు జెడ్పీ హైస్కూల్ 1983–84 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఔదార్యం చాటుకున్నారు. ఇందులో భాగంగానే పాఠశాలకు అవసరమైన కుర్చీలు, అరలను ప్రధానోపాధ్యాయుడు నాగార్జునకు అందచేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు రామాంజనరెడ్డి, జయరాం యాదవ్, రామచంద్రారెడ్డి, జీవీ శీనప్ప, రామాంజప్ప, రామచంద్ర పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 14 గొర్రె పిల్లల మృతి


మృతి చెందిన గొర్రె పిల్లలు

మడకశిరరూరల్: మండల పరిధిలోని తురుకువాండ్లపల్లిలో సోమవారం కుక్కల దాడిలో14 గొర్రె పిల్లలు, ఒక మేక పిల్ల మృతి చెందినట్లు కాపరి ఈరప్ప తెలిపారు. గొర్రె పిల్లలు, ఒక మేక పిల్లను రొప్పంలోనే వదిలి గొర్రెలను మేతకు తీసుకెళ్లి సాయంత్రం రొప్పానికి వచ్చామన్నారు. అయితే అప్పటికే పిల్లలను కుక్కలు దాడి చేసి చంపేశాయని ఆవేదన వ్యక్తం చేశారు. దాదాపు రూ.60 వేలకు పైగా నష్టం జరిగిందని వాపోయారు. గొర్రెల పెంపకంతోనే కుటుంబ పోషణ సాగిస్తున్నామని, ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తిప్పేస్వామికి రాష్ట్రపతి పతకం



పావగడ: తాలూకాలోని ఓబళాపురం గ్రామానికి చెందిన రాష్ట్ర అగ్నిమాపక దళం డిప్యూటీ డైరెక్టర్ జి తిప్పేస్వామికి రాష్ట్రపతి పతకం దక్కింది. ఇటీవల బెంగళూరులో నిర్వహించిన గణతంత్ర రాజ్యోత్సవ వేడుకల్లో సీఎం సిద్ధరామయ్య ఆయనకు రాష్ట్రపతి పతకం అందించారు. అగ్నిమాపక కేంద్రం లో డీడీగా తిప్పేస్వామి అందించిన అత్యుత్తమ సేవలను గుర్తించి పతకం అందించారు. ఆయనకు అవార్డు రావడం పట్ల ఓబుళాపురం గ్రామస్తులు హర్షం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యే తిమ్మరాయప్ప తదితర ప్రముఖులు అవార్డు గ్రహీత తిప్పేస్వామిని అభినందించారు.

ఎస్టీయూ క్యాలెండర్ ఆవిష్కరణ

గుడిబండ: ఎస్టీయూ ఉపాధ్యాయుల సంఘం నూతన సంవత్సరం క్యాలెండర్, డైరీని సోమవారం స్థానిక మండల కేంద్రంలోని విద్యా వనరుల కేంద్రంలో మండల విద్యాధికారి రవిచంద్రన్ ఆవిష్కరించారు. ఆ సంఘం జిల్లా కార్యదర్శి జయకృష్ణ , ఉపాధ్యాయులు కరియప్ప, నరసింహ, బంగారులింగ, కార్తిక్, మండల వనరుల కేంద్రం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్ వాడకంపై అవగాహన


ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

లేపాక్షి: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా చోళసముద్రం టోల్ ప్లాజా వద్ద ఎస్ఐ నరేంద్ర ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనాదారులకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించడం వలన కలిగే ప్రయోజనాలు, ధరించకపోతే జరిగే ప్రమాదాలను వివరించారు.

- పెనుకొండ పట్టణ, మండల పరిధిలో నిర్వహించిన రెవెన్యూ సభలకు 436 అర్జీలు వచ్చాయి. ఇందులో కేవలం 42 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయి. ఇంకా 394 పెండింగ్‌లో ఉన్నాయి.
- మడకశిర మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 83 అర్జీలు వచ్చాయి. 24 అర్జీలను పరిష్కరించిన అధికారులు 59 అర్జీలకు పరిష్కారం చూపలేదు.
- గుడిబండ మండలంలో జరిగిన రెవెన్యూ సదస్సులకు 60 అర్జీలు అందాయి. ఇంత వరకూ ఒక్క సమస్యను కూడా పరిష్కరించలేదు.
- రొళ్ల మండలంలో రెవెన్యూ సదస్సుల్లో 144 అర్జీలు అందాయి. అయితే 43 అర్జీలను మాత్రమే పరిష్కరించారు. 101 అర్జీలకు మోక్షం లభించలేదు.
- సోమందేపల్లి మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులకు 401 దరఖాస్తులు వచ్చాయి. అయితే కేవలం 32 వాటికి పరిష్కారం చూపిన అధికారులు 369 అర్జీలను అటకెక్కించారు.

సమస్యలకు పరిష్కారమేదీ?

గ్రౌండ్ రిపోర్ట్

కూటమి ప్రభుత్వం ఈ మధ్యనే రెవెన్యూ సదస్సులంటూ ప్రతి గ్రామంలోనూ సభలను నిర్వహించింది. భూసమస్యలు మొదలు అన్ని సమస్యలు పరిష్కరిస్తామంటూ ప్రజాప్రతినిధులు ఊదరగొట్టారు. అయితే హిందూపురం పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని చాలా గ్రామాల్లో సదస్సులైతే నిర్వహించారు గాని సమస్యలు మాత్రం పరిష్కారం కాలేదు. దీంతో ఉత్తుత్తి సమావేశాలు పెట్టడం ఎందుకని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

– సాక్షి బృందం



శిరివరంలో జరిగిన రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ చేతన్ (ఫైల్)



ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు లక్ష్మీదేవిబాయి. ఈమెది సోమందేపల్లి మండలం నాగినాయని చెరువు తండా. ఇదే గ్రామంలోని సర్వే నంబరు 123–2 విస్తీర్ణం 3.98 పైకి రెండు ఎకరాలకు పట్టా ఇచ్చారు. అయితే 1.98 విస్తీర్ణానికి సంబంధించి ఇతరుల పేరిట వెబ్ ల్యాండ్‌లో నమోదైంది. తమకు న్యాయం చేయాలంటూ పలు దఫాలు అధికారుకు దరఖాస్తులు ఇచ్చినా ఫలితం లేకపోయింది. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో సమస్య పరిష్కారాన్ని కోరుతూ అర్జీ ఇచ్చినా న్యాయం జరగలేదు. ఇప్పటికైనా న్యాయం చేయాలని లక్ష్మీదేవిబాయి విజ్ఞప్తి చేస్తున్నారు.



ఈ రైతు పేరు యల్లారెడ్డి. ఇతనిది రొద్దం మండలం నారనాగేపల్లి పంచాయతీ రాచూరు గ్రామం. యల్లారెడ్డికి సంబంధించిన భూమి మరొకరి పేరున ఆన్‌లైన్‌లోకి ఎక్కింది. సర్వేనంబర్ 123లో వీరికి 95 సెంట్లు భూమి ఉండాలి. అయితే 23 సెంట్లు మాత్రమే ఆన్‌లైన్‌లో చూపుతోంది. మిగిలిన 73 సెంట్లు మరొకరి పేరున మారింది. ఈ నేపథ్యంలోనే సమస్య పరిష్కారం కోసం ఆరు నెలలుగా బాధిత రైతు తహసీల్దార్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నా ఫలితం మాత్రం లేదు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా అర్జీ ఇచ్చానని, అయినా భూసమస్యను పరిష్కరించడం లేదని యల్లారెడ్డి వాపోతున్నారు.

- తూతూ మంత్రంగా రెవెన్యూ సదస్సులు
- అర్జీలు స్వీకరించినా సమస్యలను పరిష్కరించని అధికారులు
- ఇంకా ఎన్నిరోజులు వేచిచూడాలంటున్న లబ్ధిదారులు


గౌడనహళ్లిలో రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ కరుణాకర్‌కు అర్జీ అందిస్తున్న రైతులు (ఫైల్)

ఎన్ని రోజులు వేచి చూడాలో..



పట్టాదారు పాసుపుస్తకం మంజూరు కోసం రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చాను. గతంలో మా అన్నదమ్ములందరికీ పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేశారు. అయితే నా పేరు మీదా 5.80 సెట్లు భూమి ఉంది. పట్టాదారు పాసుపుస్తకం పొందడానికి తహసీల్దార్ కార్యాలయానికి లెక్కలేనన్ని సార్లు వెళ్లి అర్జీలు సమర్పించుకున్నా పాసుపుస్తకం ఇవ్వలేదు. గత నెల 26వ తేదిన బీజీ హళ్లిలో జరిగిన రెవెన్యూ సదస్సులో కూడా అర్జీ ఇచ్చాను. ఇంత వరకూ అధికారుల నుంచి ఎలాంటి సమాచారం రాలేదు. వెంటనే పట్టాదారు పాసు పుస్తకం మంజూరు చేయాలి.

– సన్నరాయప్ప, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

అర్జీని ఎప్పుడు పరిష్కరిస్తారో?



మా అమ్మ పేరుమీద ఉన్న ఆస్తి మొత్తాన్ని నా తమ్ముడు తన పేరుతో పాసు పుస్తకం చేయించుకున్నాడు. ఈ విషయంపై పెనుకొండ సబ్‌కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. అయితే మీరు భాగాలను చేసుకుంటున్నట్లు పత్రాలు ఇస్తే పాసుపుస్తకం చేస్తామని చెప్పి కూడా సంవత్సరం గడుస్తోంది. దీనిపై గ్రామంలో జరిగిన రెవెన్యూ సభలో కూడా అర్జీ సమర్పించాను. అయినా ఇప్పటికీ మా సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు.

–రామాంజినప్ప, కొండూరు, లేపాక్షి మండలం

సమస్యల పరిష్కారంలో విఫలం



గ్రామాల్లో నెలకొన్న సమస్యలతో పాటు భూ సమస్యల పరిష్కారం కోసం ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహించింది. లక్ష్యం మంచిదే కాని సమస్యలు పరిష్కరించడంలో అధికారలు విఫలమయ్యారు. మా గ్రామంలో నడిబొడ్డున చెరువు సప్లయ్ చానల్ వెళ్తోంది. సప్లయ్ చానల్ పూడిపోవడంతో వర్షనీరు చెరువుకు చేరడం లేదు. సప్లయ్ చానల్ డ్రైనేజీగా మారి కొన్నేళ్లుగా మురికి నీరు నిలువ ఉండటంతో ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. దీనిపై ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం లేదు.

– రామచంద్రారెడ్డి, కరావులపల్లి, గోరంట్ల మండలం

పేరుకే రెవెన్యూ సభలు



పేరుకే రెవిన్యూ అధికారులు పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నారు. ప్రజల సమస్యలు ఎక్కడా పరిష్కరించిన దాఖలాలు కనిపించడం లేదు. అధికారులు నామమాత్రంగానే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నారు. గ్రామస్థాయిలో సమస్యలకు పరిష్కారం దొరికితే మండలస్థాయి కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదు.

– ప్రకాశ్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షుడు, పెనుకొండ

ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి



మడకశిర మండల పరిధిలోని జమ్మానిపల్లి నుంచి వెంకటాపురం రోడ్డులో పడిన గుంతలు, పెరిగిన కంపచెట్లను ఉపాధి హామీ పథకం కింద తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలని రెవెన్యూ సదస్సులో అర్జీ ఇచ్చాం. కానీ ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రజల ఇబ్బందులు గుర్తించి అధికారులు చర్యలు తీసుకుని ఆలస్యం చేయకుండా మరమ్మతు పనులు చేపట్టాలి.

– హనుమంతరాయప్ప, గౌడనహళ్లి, మడకశిర మండలం

పట్టాదారు పుస్తకం ఇవ్వాలి



నా తండ్రి నాన్న ఓబుళప్ప కొన్ని నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయనపై ఉన్న భూమిని అమ్మ పేరు మీద పట్టాదారు పాసు పుస్తకం చేసుకునేందుకు ఇబ్బందులు పడుతున్నాం. రెవెన్యూ సదస్సులో కూడా అర్జీ ఇచ్చాము. నేటికీ ఆ సమస్య మాత్రం పరిష్కారం కాలేదు. అధికారులు చర్యలు తీసుకుని అమ్మ పేరు మీద పట్టాదారు పాసు పుస్తకం ఇవ్వాలి.

– సోమశేఖర్, కొంకల్లు, గుడిబండ మండలం

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

గోరంట్ల: 'తమకు హక్కు ఉన్న భూములను రెవెన్యూ అధికారులు తమ సమీప బంధువులకు పాసు పుస్తకాలు మంజూరు చేశారు. వారు వాటిని విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారు' అంటూ యర్రయ్యగారిపల్లికి చెందిన కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా చేశారు. కమ్మవారిపల్లి రెవెన్యూ పొలం సర్వే నంబర్ 119, 118, 117తో పాటు మరో 15 సర్వే నంబర్లలో తమ కుటుంబానికి హక్కు ఉందన్నారు. అయితే తమకు రెవెన్యూ అధికారులు ఎలాంటి నోటీసు ఇవ్వాకుండా తమ సమీప బంధువుల పేరు మీద పాసు పుస్తకాలు మంజూరు చేశారని కృష్ణారెడ్డి కుటుంబ సభ్యులు ఆరోపించారు. ప్రస్తుతం వారు విక్రయించడానికి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. వెబ్‌ల్యాండ్ అడంగల్‌ను హోల్డ్‌లో పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ మారుతీప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. తహసీల్దార్ స్పందిస్తూ భూమిని హోల్డ్‌లో పెట్టే అధికారం తమకు లేదని, జరిగిన దాన్ని జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైతు కుటుంబానికి హామీ ఇచ్చారు.

మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయండి


రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతి పత్రం ఇస్తున్న దృశ్యం

మడకశిర: మడకశిర కేంద్రంగా రెవెన్యూ డివిజన్ ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం అమరావతిలో రాష్ట్ర రెవెన్యూశాఖా మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు ఎంపీ పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి వినతి పత్రం అందించారు. మడకశిర నియోజకవర్గంలో 5 మండలాలు ఉన్నాయని, ప్రస్తుతం పెనుకొండలో రెవెన్యూ డివిజన్ కేంద్రం ఉండటంతో అమరాపురం, అగళి, గుడిబండ, రొళ్ల మండలాల ప్రజలు దాదాపు 85 కి.మీ వెళ్లి పనులు చేయించుకోవాల్సి వస్తోందన్నారు. ఈ విషయంలో మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు పేర్కొన్నారు.

అయూబ్‌ఖాన్ మృతికి నివాళి


అయూబ్‌ఖాన్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: హిందూపురం మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు అబ్దుల్లాఖాన్ సోదరుడు అయూబ్‌ఖాన్ సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి టీఎన్.దీపిక... అయూబ్‌ఖాన్ భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో రాష్ట్ర కురుబ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్‌పీ శివ, కౌన్సిలర్లు ఆసిఫుల్లా, రామచంద్ర, చంద్రశేఖర్‌రెడ్డి, కొల్లకుంట శివశంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆట కట్టించండి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఆందోళనకారులు

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఉన్న పేదలపై అధిక వడ్డీలు మోపి వారి బతుకులతో చెలగాట మాడుతున్న మైక్రో ఫైనాన్స్ సంస్థల ఆటలు కట్టించి వారి బారి నుంచి పేదలను కాపాడాలని స్థానిక వివిధ సంఘాల పదాధికారులు డిమాండ్ చేశారు. స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట కర్ణాటక రాజ్య రైతు సంఘం అధ్యక్షుడు పూజారప్ప నేతృత్వంలో సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. స్థానిక శ్రీక్షేత్ర ధర్మస్థల సంఘం నుంచి స్త్రీశక్తి సంఘాల సభ్యులు వారపు వడ్డీతో రుణాలు పొంది సకాలంలో వడ్డీలు కట్టలేక, వారి ఒత్తిడి భరించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీల నుంచి వారపు, నెల, మీటర్ వడ్డీలకు రుణాలు పొంది సకాలంలో వడ్డీలు చెల్లించ లేక అనేకులు ఊళ్లు వదులుతున్నారన్నారు. ఇక నుంచి ధర్మ స్థల సంఘం వారు నెల సరి వడ్డీలు వసూలు చేయాలన్నారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుతో పాటు సీపీఐ సురేష్‌కు వినతిపత్రాలు సమర్పించారు.

వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు విజయవంతం చేయండి

మడకశిరరూరల్: మండలంలోని కల్లుమర్రి గ్రామంలో వెలసిన వీరకేతమ్మ బ్రహ్మోత్సవాలు ఫిబ్రవరి 1వ తేదీ నుంచి రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 1న కలశస్థాపన, కల్యాణోత్సవం, జ్యోతుల ఉత్సవం, 2న తోమాల సేవ, నాగదేవతా పూజ, హోమం, చండీయాగం, మధ్యాహ్నం అమ్మవారి బ్రహ్మరథోత్సవం జరుగుతుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

దండురోడ్డు స్థల వివాదం

హిందూపురం అర్బన్: పట్టణంలోని దండురోడ్డులో ఉన్న వివాదాస్పద స్థలం విషయంలో ఓ వర్గం వారు తమ వద్ద తగిన పత్రాలు ఉన్నాయని స్థలాన్ని సోమవారం జేసీబీతో శుభ్రం చేయిస్తుండగా మరో వర్గం వారు అడ్డుకున్నారు. స్థలం కోర్టులో ఉండగా ఎలా చదును చేస్తారని ప్రశ్నించారు. సీఐ రాజగోపాల్‌నాయుడికి విషయం తెలియడంతో ఇరు వర్గాలను స్టేషన్‌కు పిలిపించుకున్నారు. ఏవైనా పత్రాలు ఉంటే తహసీల్దార్ వద్ద చూపించి సర్వే చేయించుకోవాలని ఇలా గొడవలకు దిగొద్దని సూచించినట్లు సీఐ తెలిపారు.

బీసీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం అర్బన్: బీసీ కార్పొరేషన్ ద్వారా 2024–25 సంవత్సరానికి ఏపీఓబీఎంఎంఎస్ ద్వారా రుణాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శివకుమార్ ఓ ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. బీసీ కులాలకు 41 యూనిట్లు, కాపు కార్పొరేషన్ నుంచి 14 యూనిట్లు మంజూరయ్యాన్నారు. హిందూపురం మండలంలోని అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రోడ్డు భద్రతపై అవగాహన

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలో రోడ్డు భద్రతపై సోమవారం పోలీసులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. క్రీస్తు జ్యోతి పాఠశాల విద్యార్థులు ర్యాలీలో పాల్గొన్నారు. ఏఎస్ఐ మురళి, హెడ్‌కానిస్టేబుల్ సుధాకర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆట వస్తువుల వితరణ

లేపాక్షి: మండల పరిధిలోని శిరివరంలోని అంగన్‌వాడీ కేంద్రం–2, మిని అంగన్‌వాడీ కేంద్రాలకు స్థానికులు రూ.వేలు విలువ చేసే అవసరమైన సామగ్రితో పాటు ఆటవస్తువులను సోమవారం వితరణ చేశారు. ఐసీడీఎస్ సీడీపీఓ శాంతమ్మ, సూపర్‌వైజర్ మంజుల, అంగన్‌వాడీ కార్యకర్తలు జయపద్మ, గంగరత్న, శివమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళలకు కుట్టుపై శిక్షణ

అమరాపురం: స్థానిక ఐకేపీ కార్యాలయంలో ఏపీఎం ముత్యాలప్ప ఆధ్వర్యంలో నిరుద్యోగ మహిళలకు కుట్టు శిక్షణపై సోమవారం అవగాహన కల్పించారు. ఏపీఎం ముత్యాలప్ప మాట్లాడుతూ గ్రామాల్లో నిరుద్యోగ యువతులకు కుట్టుపై శిక్షణ ఇచ్చి, అనంతరం సర్టిఫికెట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలి


మాట్లాడుతున్న ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్

మడకశిర: చిరు వ్యాపారులకు ప్రభుత్వం అండగా ఉండాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తక్కువ వడ్డీకే రుణాలను అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం సీపీఐ ఆధ్వర్యంలో వినాయక చిరు పూల వ్యాపారుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలో హోల్‌సేల్ వ్యాపారులు చిరు పూల వ్యాపారుల పొట్ట కొడుతున్నారని పేర్కొన్నారు. దీంతో చిరు పూల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. హోల్‌సేల్ వ్యాపారులను మార్కెట్‌యార్డుకు మార్చాలన్నారు. చిరు పూల వ్యాపారులకు అన్ని విధాలుగా అండగా ఉంటామన్నారు. ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకుని చిరు పూల వ్యాపారులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీపీఐ కార్యదర్శి పవిత్ర, మున్సిపల్ కార్మికుల యూనియన్ అధ్యక్షుడు సురేష్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

వివిధ సమస్యలపై ఆరు అర్జీలు

పెనుకొండ రూరల్: పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆర్డీఓ ఆనంద్ కుమార్ తెలిపారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి ఆరు అర్జీలు అందినట్లు పేర్కొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

మడకశిరరూరల్: మండలంలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి 30 వరకూ జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 31 వరకూ క్షేత్రస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ శ్రీకాంత్‌గౌడ్ తెలిపారు. తనిఖీ వివరాలను ఫిబ్రవరి 1న మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజావేదిక కార్యక్రమం ద్వారా వెల్లడిస్తామన్నారు.

చెలరేగిన మంటలు

గుడిబండ: మండల పరిధిలోని తాళికెర సమీపంలో సోమవారం కొందరు బీడీలు, సిగరెట్లు కాల్చి రోడ్డు పక్కన వేయడంతో ఎండిన గడ్డి అంటుకుంది. మంటలు పక్కనే ఉన్న పొలాలకు వ్యాపించాయి. విషయం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపు చేశారు.

అసాంఘిక కార్యకలాపాలపై దృష్టి

అగళి: స్థానిక పోలీస్‌స్టేషన్‌ను సీఐ రాజకుమార్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించడంతో పాటు పెండింగ్ కేసుల వివరాల అడిగి తెలుసుకున్నారు. అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ వీరేష్, ఏఎస్ఐ శ్రీరాములు, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అమరాపురం: స్థానిక వైఎస్సార్ సర్కిల్‌లో సోమవారం రాత్రి ఎస్ఐ ఇషాక్ బాషా ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేశారు. ముఖ్యంగా వాహనాల లైసెన్స్‌లు, రికార్డులను పరిశీలించారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లాం

మడకశిర: ముఖ్యమంత్రి చంద్రబాబును సోమవారం విజయవాడలో కలిసినట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. తనతో పాటు మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి కూడా సీఎంను కలిసి నియోజకవర్గానికి సంబంధించిన పలు సమస్యలను వివరించామన్నారు. మడకశిరలోని సమస్యల పరిష్కారానికి, అభివృద్ధికి సహకారం అందిస్తానని సీఎం హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.